నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, బేగంపేట సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌లాండ్స్ ఏడిఇ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తాతాచారి కాలనీ, బొంబే హల్వా కాంపౌండ్, పోచమ్మ బస్తీ, ఆర్‌బిఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ప్రాంతం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గురుమూర్తి లైన్, తాతాచారి కాలనీ, ఆర్‌బిఐ క్వార్టర్స్, బొంబే హల్వా కాంపౌండ్, ఐజిపురం, బేగంపేట బస్తీ, కట్టమైసమ్మ ఆలయం, హెచ్‌పిఎస్ మెయిన్ రోడ్డు, శివం పెట్రోల్ పంప్, శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

27, 28 తేదీల్లో బోనాలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బాలంరాయి శ్రీదేవి దండు మారెమ్మ ఆషాడ మాస బోనాల ఉత్సాహాలను జూలై 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రవికాంత్ తెలిపారు. బోనాల ఉత్సాహాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయం ఆవరణలో భక్తులతో సమావేశం నిర్వహించారు. ఆలయానికి పెయింటింగ్ పనులు, విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణ చేయాలని నిర్ణయించారు. ఈఓ రవికాంత్ మాట్లాడుతూ భక్తుల సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకుని ప్రశాంత వాతావరణంలో బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్



బౌద్ధనగర్: సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని ఆదివారం బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరినీ అమ్మవారు కటాక్షించాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

బౌద్ధనగర్: తలసేమియా వ్యాధి బారిన పడ్డ చిన్నారుల సహాయార్థం అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ ఆధ్వర్యంలో బౌద్ధనగర్ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలు, నాగమళ్ల సుధాకర్, ప్రభాకర్, కే శ్రీనివాస్, శైలెందర్, రవీందర్ సాగర్, బాబు రావు పాల్గొన్నారు.

ఎంఎస్పీ డివిజన్ కమిటీ ఎన్నిక



అడ్డగుట్ట డివిజన్ ఎంఎస్పీ నూతన కార్యవర్గ సభ్యులు

అడ్డగుట్ట: డివిజన్ ఎంఎస్పీ నూతన కార్యవర్గం ఎన్నిక ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ కోకన్వీనర్ వేణుగోపాల్ నేతృత్వంలో ఆదివారం అడ్డగుట్టలోని బీరప్ప దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడిగా మెడ బాబు, అధికార ప్రతినిధిగా పీ. నర్సింగ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

పంజగుట్ట: గుర్తుతెలియని మృతదేహాన్ని పంజగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 6:30 ప్రాంతంలో బేగంపేట మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబర్ సి 1404 సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. సదరు వ్యక్తికి సుమారు 50 నుండి 55 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు 8712661275 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బోనాల వేడుకలు షురూ

అమ్మవారి ఘటం ఎదుర్కొళ్లతో ప్రారంభమైన సికింద్రాబాద్ లష్కర్ మహాకాళి బోనాల వేడుకలు





బన్సీలాల్‌పేట్: చారిత్రాత్మకమైన సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. 29వ తేదీ ఆదివారం అమ్మవారి ఘటం ఎదుర్కొళ్లతో లష్కర్ బోనాల ఉత్సవాలకు అంకురార్పణ జరిగినట్లయింది. తెలంగాణ సంస్కృతి...సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ మహంకాళి అమ్మవారి బోనాల పండుగకు ఎంతో ప్రాముఖ్యత...ప్రాధాన్యత ఉంది. సికింద్రాబాద్ బుద్ధభవన్ ఎదురుగా ఉన్న అమ్మవారి దేవాలయంలో మహంకాళమ్మ ఘటాన్ని ముస్తాబు చేశారు. డప్పుచప్పుళ్ల బ్యాండ్ మేళాల మధ్య పోతరాజుల వీర నృత్యాల మధ్య అమ్మవారి ఘటాన్ని పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. జీరా ఇందిరానగర్ నుంచి ప్రారంభమైన అమ్మవారి ఘటం ఎదుర్కొళ్లు కర్బలామైదాన్ చౌరస్తా, డిస్టలరీ రోడ్డు, రాణిగంజ్...పాన్‌బజార్ ...సుభాష్ రోడ్డు గుండా మహంకాళి దేవాలయానికి చేరుకుంది. అడుగడుగునా భక్తులు అమ్మవారి ఘటాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తి పూర్వకంగా అమ్మవారికి సాక సమర్పించి, టెంకాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. అమ్మవారి ఘటం ఊరేగింపు సికింద్రాబాద్ పురవీధుల్లో కోలాహలంగా సాగింది.

ఆకట్టుకునేలా అమ్మవారి ఘటం..

సికింద్రాబాద్ మహంకాళమ్మ దేవాలయం అమ్మవారి ఘటాన్ని వెదురుబద్దలతో తయారు చేసి చుట్టువేపాకులు...పువ్వులతో అందంగా ముస్తాబు చేశారు. ఆచార వ్యవహారం ప్రకారం ప్రతి ఏటా కర్బలామైదానం సమీపంలోని అమ్మవారి దేవాలయం వద్ద అమ్మవారి ఘటాన్ని ముస్తాబు చేసి దేవాలయానికి తీసుకువస్తారు. అమ్మవారి ఘటాన్ని ప్రతి రోజు వివిధ ప్రాంతాల్లో భక్తుల సందర్శనార్థం ఊరేగిస్తారు. రాణిగంజ్, పాన్‌బజార్ ప్రాంతాల్లో స్వాగత వేదికలను ఏర్పాటు చేసి మహంకాళి అమ్మవారి ఘటానికి ఆదివారం రాత్రి వివిధ పార్టీలకు చెందిన నాయకులు దేశపాక శ్రీనివాస్, మసాల బాబు రావు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, సనత్ నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, మనోజ్ కుమార్, ఎస్సీ ఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్ బాబు, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, కేఎం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాలు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ఆదయ్యనగర్‌లోని 18 టెంపుల్స్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

పద్మారావునగర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప పండుగ లష్కర్ బోనాల వేడుకలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మోండా డివిజన్ ఆదయ్యనగర్‌లోని 18 టెంపుల్స్‌లో ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సాక సమర్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బోనాల వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుళ్ల...పోతరాజుల వీర నృత్యాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఏకాంబరం, సాయి, శేఖర్, భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు రాములు, మహేందర్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫలహారపు బండి ఊరేగింపు..

మహంకాళి మాణిక్యాలమ్మ సేవా సమితి కటారి మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం రంగ్రేజ్ బజార్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి తొట్టెల ఊరేగింపు, ఫలహారపు బండిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు.

ఎమ్మెల్యేగా అవకాశం లభించడం నా అదృష్టం

శ్రీ గణేష్

బొల్లారం: కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా బొల్లారం రిసాల బజార్‌లో షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ''ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి సేవలందించే అవకాశం లభించడం ఎంతో గర్వంగా ఉంది. ప్రతి క్షణం ప్రజలతోపాటే ఉండి కంటోన్మెంట్‌ను ఆదర్శ నియోజకవర్గంగా అభివద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదిర్వన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పాల్గొన్నారు.

అమ్మవారికి పండ్లతో అలంకరణ



సనత్‌నగర్: ఆషాడ మాసం మొదటి ఆదివారం పురస్కరించుకొని సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (7 టెంపుల్స్)లో కొలువుదీరిన గ్రామ దేవత పోచమ్మ తల్లి అమ్మవారికి వివిధ రకాల పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈఓ సత్యనారాయణ నాయుడు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు విజయేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం



తలసానిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రఘురామన్

రసూల్‌పురా: దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రసూల్‌పురా హాకీస్టేడియం సమీపం లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేకం పూజలలో తలసాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆలయ ముఖ ద్వారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆలయ నిర్వహకులు తలసానిని ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించి రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయకమిటీ చైర్మన్ రఘురామన్, అధ్యక్షుడు శ్యాంకుమార్, టిఎన్. ప్రవీణ్ పాల్గొన్నారు.

అమ్మవారికి చిట్టిగాజుల దండలు



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఆర్‌బీ నరేష్ ప్రతి యేటా మాదిరిగా ఏయేడు కూడా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా రూపొందించిన దండను ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సంవత్సరం బెంగుళూరు నుంచి తెప్పించిన చిట్టిగాజుల దండలను అమ్మవారి అలంకరణ నిమిత్తం అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా ప్రత్యేకంగా దండలు తయారు చేయించి అమ్మవారికి సమర్పించటం ఆనవాయితీగా వస్తున్నది.

అమ్మవారి ఉత్సవాలకు రండి



కోట నీలిమకు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ ఉత్సవాలకు రావాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమకు ఆదివారం ఆలయ అధికారులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సోమవారం ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవారి ఎదుర్కోలు, మంగళవారం కళ్యాణోత్సవం, బుధవారం రథోత్సవం వేడుకలు వైభవంగా జరుపుతున్నట్లు ఈ సందర్భంగా ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ ఆమెకు వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హైమావతి, దేవస్థానం ట్రస్టీ బోర్డు సభ్యులు శ్రీనివాస రావు, రాజేశ్వరి, శ్రీనివాస్ రెడ్డి, రజనికాంత్, నవీన్ రాజు, శంకర్‌గౌడ్, రవీందర్, మహేష్, శ్రీధర్ గౌడ్, ఉమారాణి, అమృత, భూలక్ష్మీ, హరి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతలు సహకరించాలి

ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్: పేద విద్యార్థులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఈస్ట్ మారేడు పల్లి లోని లోహియా నగర్ బస్తీలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సి సంతోష్ యాదవ్, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై 300 మంది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు ,టిఫిన్ బాక్స్ లు అందజేశారు. అంతకుముందు సీనియర్ నాయకులు సి సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో బస్తీలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడితే ప్రజల ఆదరణ అభిమానాలు పొందుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ యాదవ్ , నాగేష్, డి శ్యాంసుందర్, నర్సింగ్ ,మహేష్ ,క్రాంతి కుమార్ ,అరుణ్ కుమార్, వెంకటమ్మ, అనురాధ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

'ఆదం'కు పలువురి జన్మదిన శుభాకాంక్షలు



బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న ఆదం సంతోష్‌కుమార్

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆదం సంతోష్‌కుమార్ జన్మదిన వేడుకలు సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మెగా హెల్త్‌క్యాంప్‌ను ఆదం సంతోష్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. మాజీమంత్రి చిన్నారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హన్మంతరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, నాయకులు ఫిరోజ్‌ఖాన్, నాగులూరి సాయిబాబా, కోట నీలిమ, నవీన్‌యాదవ్ తదితరులు ఆదం సంతోష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు కార్యకర్తలు ఆటపాటలతో సందడి చేసి గజమాలతో సంతోష్‌కుమార్‌ను సన్మానించారు.

బోరబండ ఠాణాలో ఎన్ఎస్‌యూఐ నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ కార్యకర్తలు

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఎన్ఎస్‌యూఐ నాయకులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీఆర్ హిల్స్ టి.అంజయ్యనగర్ బస్తీ ఎన్నికల విషయమై స్థానిక నాయకుడు శివకుమార్‌ను బోరబండ పోలీసులు ఆదివారం ఉదయం స్టేషన్‌కు పిలిపించారు. ఈ విషయం తెలియడంతో డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్‌కు ఫోన్ చేయగా నిన్ను కూడా లోపల వేస్తానని చెప్పడంతో రాత్రి అతను తన అనుచరులు, యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి బోరబండ స్టేషన్‌కు వచ్చారు. ఎస్‌హెచ్‌ఓ అందుబాటులో లేక పోవడంతో ఆయనను పిలిపించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఎస్సై నాగూల్‌మీరాతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ రాఘవేంద్రరావు , బోరబండ ఎస్‌హెచ్‌ఓ అక్కడికి వచ్చి వెంకటస్వామితో పాటు నాయకులతో కలిసి చర్చించి సమస్య సద్దుమనిగేలా చేశారు.

సీపీఎం జోన్ కమిటీ సమావేశం



సీపీఎం సికింద్రాబాద్ జోన్ నూతన కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: సీపీఎం సికింద్రాబాద్ జోన్ కమిటీ సమావేశం ఆదివారం అడ్డగుట్టలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి ఎం. వెంకటేష్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌లు హాజరై నూతన కమిటీని ప్రకటించారు. జోన్ కన్వీనర్‌గా ఆర్. మల్లేష్‌ను, కమిటీ సభ్యులుగా అజయ్ బాబు, గోపాల్, మధు ఎల్లయ్య, శారద, అంజమ్మ, ప్రభాకర్‌లను నియమించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నర్సయ్య, వెంకటేష్, లలిత, వసంత, సరోజ, దీపా, లక్ష్మి, రామచందర్, పాషా, పోచయ్య, భాగ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో 5 శాతం సీలింగ్ ఎత్తేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పరశురామ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో కారుణ్య నిమాయకాలకు సంబంధించి 5 శాతం సీలింగ్ ఎత్తేసి, అర్హులైన వారందరికీ ఉద్యోగాలు కల్పించాలని కంటోన్మెంట్ ఉద్యోగుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి పరశురామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న అర్హులతో కలిసి పికెట్ పార్కులో విలేకరులతో మాట్లాడారు. కారుణ్య నియామకాల కోసం తాము 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని అన్నారు. 5శాతం సీలింగ్ నిబంధన కారణంగా కేవలం 26 మందికి ఉద్యోగాలు దక్కాయని, మరో 100 మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో సీలింగ్ ఎత్తేయాల్సిందిగా తాము స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు.

మోదీ హయాంలోనే అన్ని రంగాల అభివృద్ధి

శ్రీనగర్‌కాలనీ: ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కళ్యాణ్‌నగర్ వెంచర్-3 పార్క్‌లో మన్‌కీ బాత్ 123 ఎపిసోడ్‌ను బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ 11ఏళ్ళపాటు దేశాన్ని సుభిక్షంగా ఉంచారన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ దేశాభివృద్ధి, సంక్షేమపథకాలు, టెక్నాలజీ, ఆర్థికవ్యవస్థ, మహిళాభివృద్ధితో పాటు పలు విషయాలను వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు మోహన్ రావు, గౌతమ్‌రావు, లంకల దీపక్‌రెడ్డి, కిలారి మనోహర్, ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, శ్రీనివాసరెడ్డి, అనంతలక్ష్మి, కళ్యాణ్‌నగర్ వెంచర్-3 కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగల వ్యాపారి అదృశ్యం

వెంగళరావునగర్: బంగారు నగల వ్యాపారి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన భాస్కర్, ఉమా దంపతులు కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి బంగారు నగలు తయారు చేసి జీవనం సాగిస్తున్నరు. తొలుత చిన్న షాపుల వద్ద ఆర్డర్లు తీసుకుని వస్తువులు తయారు చేసి ఇచ్చేవారు. ఈ క్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన సచిన్‌తో పరిచయం కావడంతో అతని వద్ద గోల్డ్‌బిస్కెట్లు తీసుకుని వస్తువులు తయారు చేసి ఇస్తున్నాడు. నగదు విషయమై సచిన్ ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి లోనైన భాస్కర్ ఈ నెల 28న ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతడి భార్య ఉమ ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

పత్తాలేని స్పెషల్ డ్రైవ్

- యాచకుల తరలింపుపై నిర్లక్ష్యం
- ఖైరతాబాద్‌లోని పలు ప్రధాన కూడళ్లలో భిక్షాటన
- పట్టించుకోని అధికారులు



ఫుట్‌పాత్ నిరాశ్రయులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: హైదరాబాద్‌ను బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చేందుకు జీహెచ్ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నగరంలోని వివిధ కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు యాచకులను గుర్తించి వారిని షెల్టర్ హోమ్స్‌కు తరలిస్తున్నారు. కొందరు యాచకుల వివరాలను తీసుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. చౌరస్తాల్లో యాచకులందరినీ గుర్తించి షెల్టర్ హోమ్స్‌కు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలోని చౌరస్తాల్లో మాత్రం ఈ స్పెషల్ డ్రైవ్ ప్రహసనంగా మారుతోంది. జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు, సిబ్బంది ఇంతవరకు ఈ డివిజన్లలోని కూడళ్లలో తనిఖీలు చేపట్టలేదు. ఖైరతాబాద్, లక్డీకాపూల్, పంజగుట్ట, అమీర్‌పేట, బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తా, జూబ్లీహిల్స్ చౌరస్తా, ఇందిరానగర్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, విరించి ఆస్పత్రి, తాజ్‌కృష్ణ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో యాచకులు ఉండగా, ఇప్పటి వరకు వీరిని గుర్తించే పని కూడా యూసీడీ విభాగం అధికారులు సరిగా చేపట్టలేదు. వందల సంఖ్యలో యాచకులు నిత్యం ఆయా కూడళ్లలో చేతులు చాపుతూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారు. అయితే ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటి వరకు 15 మందిని, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 18 మందిని మాత్రమే యూసీడీ విభాగం గుర్తించింది. వీరందరినీ తాము గతంలోనే షెల్టర్ హోమ్స్‌కు తరలించామని, తిరిగి వస్తున్నారంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. షెల్టర్ హోమ్స్‌లలో సౌకర్యాలు సరిగా లేనందునే తాము తిరిగి చౌరస్తాలకు చేరుకుంటున్నామని యాచకులు పేర్కొంటున్నారు. నగరాన్ని బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చే ప్రక్రియలో ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక స్వయంగా ముఖ్యమంత్రి నివసిస్తున్న సర్కిల్‌లోనే అమలుకు నోచుకోవడం లేదు. యూసీడీ విభాగం గత 5 రోజులుగా ఈ ఆపరేషన్‌లో భాగంగా నగరంలోని ప్రధాన జంక్షన్లు, దేవాలయాలు, ఆస్పత్రులు, జనసమూహ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేసి జీహెచ్ఎంసీ షెల్టర్ హోమ్‌కు తరలిస్తున్నారు. జూబ్లీహిల్స్ చౌరస్తా, కేబీఆర్ పార్కు చౌరస్తా, పంజగుట్ట చౌరస్తా, బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తా, పెద్దమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ఇప్పటిదాకా స్పెషల్ డ్రైవ్ చేపట్టలేదు. యాచకులతో పాటు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులను కూడా తరలించే ప్రక్రియ రెగ్యులర్‌గా కొనసాగుతుందని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ స్పష్టం చేశారు. అయితే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ముందు మాత్రం నిరాశ్రయులను హోమ్స్‌కు తరలించే ప్రకియ సరిగ్గా జరగడం లేదు. గత కొంతకాలంగా బంజారాహిల్స్ పోలీసులు ఇక్కడ ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు కౌన్సెలింగ్ ఇచ్చి హమ్స్‌కు తరలిస్తున్నారు. అయితే వారిలో చాలామంది హోమ్స్‌కు వెళ్లిన మూడు రోజుల్లోనే తిరిగి బసవతారకం వైపు వస్తున్నారు. దీంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతిరోజూ బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు, రాత్రి భోజనాలు ఉచితంగా లభిస్తుండడంతో చాలామంది అక్కడి నుంచి కదలడం లేదు. దీంతో పోలీసులు ఈ ప్రాంతంలో పికెటింగ్ ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి యాచకులను గుర్తించి వారికి మంచి సౌకర్యాలతో హోమ్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.